# పత్రపుష్పము

## నిమిత్త టీచర్లు మరియు సర్వ బ్రాహ్మణ కులభూషణ సోదరీ సోదరులకు మధుర స్మృతిపత్రము
## (11-7-17)

ప్రాణప్రియులైన అవ్యక్తమూర్తులగు మాతాపిత బాప్‌దాదాల అతిస్నేహులు, సదా స్మృతి మరియు సేవల బ్యాలెన్స్ ద్వారా సర్వశ్రేష్ఠ భాగ్యమును తయారుచేసుకునే, తమ పవిత్రత యొక్క పర్సనాలిటీ మరియు రాయల్టీ ద్వారా క్రొత్త విశ్వ నిర్మాణంలో సదా తత్పరులై ఉండే నిమిత్త టీచర్ అక్కయ్యలు మరియు దేశ విదేశాలలోని సర్వబ్రాహ్మణ కులభూషణులైన సోదరీ సోదరులకు, ఈశ్వరీయ స్నేహ సంపన్నమైన మధుర స్మృతులతోపాటు రక్షాబంధనం యొక్క పావన పర్వదినము మరియు భవిష్య మహారాజ కుమారుడైన శ్రీకృష్ణుని జన్మోత్సవం సందర్భంగా అందరికీ చాలా, చాలా అభినందనలు.

సంగమయుగంలో ఈ పావన పర్వదినాలు కూడా అందరినీ ఉత్సాహంలోకి తీసుకువస్తాయి, అనంతమైన సేవను చేయిస్తాయి. మధురమైన బాబా మనందరికీ పవిత్రతరూపీ రాఖీని కట్టి పవిత్ర ప్రపంచానికి అధికారులుగా చేసేసారు. ఇప్పుడు మన ఆ సత్యయుగ ప్రపంచము ఇక రానున్నది. ఆ రానున్న సత్యయుగ ప్రపంచపు వృక్షము మన కళ్ళముందు కదలాడుతోంది కదా! ఇప్పుడు ఈ సంగమయుగం సంపాదన చేసుకునే యుగము. మళ్ళీ సత్యయుగంలో మనం కష్టపడేది ఉండదు. మనందరము ఎంతటి అదృష్టవంతులము! మనందరి హృదయంలో హృదయరాముడు నివాసమున్నారు. ఎవరి హృదయంలోనైతే హృదయరాముడు ఉంటారో వారు సదా సుఖశాంతిమయమైన వాయుమండలంలో ఉంటారు. వారివద్ద ఏ విధమైన దుఃఖం యొక్క చిహ్నాలూ ఉండవు. మనందరివద్ద సంతోషము మరియు శాంతి యొక్క భండారము నిండుగా ఉంది. కావున దాతగా అయి దీవెనలు ఇస్తూ ఉంటారు.

సంగమయుగంలో ఇంకొద్ది సమయమే మిగిలి ఉంది. ఈ సమయంలో జ్ఞానము, యోగము, ధారణ మరియు సేవలనే ఈ నాలుగు సబ్జెక్టులు ఎక్యురేట్‌గా ఉన్నట్లయితే సంగమయుగపు రాజ్యము ఉన్నట్లే. కార్యవ్యవహారంలో ఉంటూ మనం గృహస్థులము కాము, యోగులము, ట్రస్టీలము, తేలికగా ఉంటాము. మనము స్మృతిలో కూర్చున్నప్పుడు మనందరము ఒక్కరమే, ఒక్కరికి చెందినవారమే అన్న భావనతో కూర్చుంటాము. మొత్తం జ్ఞానమంతటి సారము ప్రత్యక్ష జీవితంలో ఉంది కావున అభిమానపు అంశము కూడా ఉండదు. నేను ఎవరిని, నా వారు ఎవరు... కావున బుద్ధి హద్దుల నుండి వైదొలగి బేహద్దులోకి వెళ్ళిపోతుంది. ఇందులో ఎటువంటి హఠయోగాలు లేక ప్రాణాయామాలు చేసే విషయమే లేదు. కేవలం సాక్షిగా అయి బాబాకు తోడుగా అవ్వాలి. బాబా నా తోడుగా ఉన్నారు కావున సాక్షిగా అయి పాత్రను పోషించడము సహజము.

బాబా నుండి ప్రకాశమును తీసుకునే బాబా పిల్లలు ఒక్కొక్కరూ లైట్‌హౌస్‌లా పనిచేస్తున్నారు. మన యోగము సహజము, మన కర్మలు కూడా సహజము. ఈ కర్మేంద్రియాలు కర్మ చేస్తూ కూడా అతీతంగా ఉంటాయి కావున బాబా ప్రేమ సహజంగా ఆకర్షిస్తూ ఉంటుంది. బాబా యొక్క మహావాక్యము ఒక్కొక్కటి అతి ప్రియమైనది మరియు అతి మధురంగా అనిపిస్తుంది. బాబా ఎలా అర్థం చేయిస్తారంటే దానితో మన్మనాభవ, మధ్యాజీభవతో అసంభవం కూడా సంభవమైపోతుంది. కేవలం బద్ధకము, నిర్లక్ష్యము మరియు సోమరితనము నుండి సురక్షితంగా ఉండాలి. తమ మనస్సుని శాంతంగా, తనువుని శీతలంగా చేసుకొని ప్రపంచాన్ని ఆ విధంగా తయారుచేసే సేవను చేయాలి. దీనికొరకు ముందు మనపై మనకు నిగ్రహం ఉండాలి. అణచడం కాదు, వాటిని ఆర్డర్‌లో ఉంచాలి. బలవంతంగా చేస్తే అప్పుడప్పుడు అలిసిపోతారు. పురుషార్థంలో అలసటలేనివారిగా అవ్వాలి, ఎప్పుడూ అలిసిపోకూడదు. కావున మా మధురమైన అన్నయ్యలు, అక్కయ్యలు అందరూ ఈ విధంగా అలసటలేనివారిగా ఉన్నారు కదా!

చూడండి, ఈ జులై, ఆగస్ట్ మాసాలు మన మధురమైన దాదీ, దీదీల స్మృతిచిహ్నా మాసాలు, వారు ఇరువురూ ఎంతగా అలసటలేని విధంగా సేవలు చేశారు! దాదీ సదా మర్యాదా పురుషోత్తమముగా ఉంటూ శ్రీమతమును ఎక్యురేట్‌గా పాలన చేస్తూ బాబా హృదయ సింహాసనాధికారిగా అయిపోయారు. దాదీ విశాల హృదయంతో యజ్ఞ సేవను ఎంత విస్తారంగా చేశారు! వారిరువురూ పూర్తి పరివారమునకు ఆత్మిక పాలనను ఇచ్చి అందరి హృదయాలపైన తమ ముద్రను వేశారు. ప్రతి ఒక్కరూ దీదీ, దాదీలను ఎంతో హృదయపూర్వకంగా గుర్తు చేసుకుంటూ ఉంటారు, వారికి లభించిన పాలనకు ప్రతిఫలాన్ని ఇస్తున్నారు. అచ్ఛా!

అందరూ నా యొక్క మరియు మధురమైన గుల్జార్ దాదీ యొక్క స్నేహముతో నిండిన స్మృతులను స్వీకరించగలరు.

ఈశ్వరీయ సేవలో,
జానకి దాదీ

## అవ్యక్త ప్రేరణలు
## "ప్రతిజ్ఞ ద్వారా ప్రత్యక్షతకు నిమిత్తంగా అవ్వండి"

1. పరమాత్మ ప్రత్యక్షత కొరకు లాస్ట్ సో ఫాస్ట్ పురుషార్థము- ప్రతిజ్ఞ. ఇది చేయాలి లేక ఇది చేయకూడదు అని ఏ విషయంలోనైనా ప్రతిజ్ఞ చేయండి. సంకల్పం చేయగానే అది స్వరూపంగా అయిపోవడము అనేటువంటి ప్రతిజ్ఞయే ప్రత్యక్షతకు నిమిత్తంగా అవుతుంది. కావున ప్రతిజ్ఞ ద్వారా స్వయమును మరియు బాబాను ప్రఖ్యాతం చేయండి.

2. ఆత్మరూపీ మణిని తప్ప ఇంక దేనినీ చూడము అని ప్రతిజ్ఞ చేయండి. ఈ ప్రతిజ్ఞ ద్వారానే మాలలోని మణులుగా అయి మొత్తం సృష్టి మధ్య ప్రకాశిస్తూ ఉంటారు. ఈ ప్రతిజ్ఞ ద్వారానే ప్రత్యక్షత జరుగుతుంది. ఇప్పుడిక ప్రయత్నంచేసే సమయం దాటిపోయింది. ఇప్పుడు ప్రతిజ్ఞను మరియు తమ సంపూర్ణ రూపమును ప్రత్యక్షం చేయాలి. స్వయమును సాక్షాత్ బాబా సమానంగా సాక్షాత్కారమూర్తిగా తయారుచేసుకోవాలి.

3. ఎప్పుడూ ఎట్టి పరిస్థితిలోను మాయతో ఓడిపోము అని ప్రతిజ్ఞ చేయండి. వ్యర్థమును సమాప్తంచేసి శ్రేష్ఠంగా అయి పరమాత్ముని కంఠహారంగా, అలంకారంగా, విజయీ రత్నంగా అవుతాము అని ప్రతిజ్ఞ చేసుకోండి. ఎప్పుడైనా ఏదైనా పరీక్ష వస్తే ఇదే ప్రతిజ్ఞను గుర్తుచేసుకోండి. ఎప్పుడైతే అందరూ ఈ విధంగా బెస్ట్‌గా అయిపోతారో అప్పుడే ప్రత్యక్షతా జెండా ఎగురవేయబడుతుంది.

4. ఇప్పటి నుండి ఈ పాత సంస్కారాలను, వ్యర్థ సంకల్పాలను ఎప్పుడూ ఉత్పన్నం కానివ్వము అని మీతో మీరు ప్రతిజ్ఞ చేయండి. ఏ ప్రతిజ్ఞనైనా జలమును సాక్షిగా చేసుకొని చేస్తారు కదా! అలాగే బాబా కూడా, నేటి నుండి ఈ ఎందుకు... అనే ప్రశ్నల క్యూని సమాప్తము చేస్తాము అనే ప్రతిజ్ఞరూపీ జలమును చేపట్టిస్తున్నారు. ఎందుకంటే ఈ ఎందుకు అన్న పదం నుండే వ్యర్థ సంకల్పాల క్యూ ప్రారంభమవుతుంది. ఎప్పుడైతే ఈ ఎందుకు అన్న పదము సమాప్తమైపోతుందో అప్పుడు డ్రామా యొక్క రచనపై ఏకరసంగా, స్థిరంగా ఉండగలుగుతారు.

5. ప్రతిఒక్కరూ తమతోతాము మూడు ప్రతిజ్ఞలు చేసుకోవాలి. 1-సహన శీలతా శక్తిని స్వయంలో ధారణ చేస్తాము, 2-వ్యర్థమునకు ఫుల్‌స్టాప్ పెడతాము, 3-ఆసురీ సంస్కారాలపై కాపలా కాస్తాము. దీనికొరకు గతించిన పాత విషయాలను ఎప్పుడూ స్మృతిలోకి తీసుకురాకండి. ఎటువంటి సమస్య వచ్చినా, ఏ కారణంగానైనా కాని ఎవ్వరిపైనా బలిహారమవ్వకూడదు. ఒక్క బాబా తప్ప ఇంకెవ్వరూ లేరు అన్న పాఠమును పక్కా చేసుకోవాలి.

6. పురుషార్థంలో నష్టదాయకమైన విషయాలు ఏవైతే ఉన్నాయో వాటిని సర్దుకునే మరియు ఇముడ్చుకునే ప్రతిజ్ఞను చేయండి, మళ్ళీ వాటిని చెక్ చేసుకోండి కూడా. "ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ లేదు" అన్న ఈ స్లోగన్ సదా స్మృతిలో ఉండాలి. ఎప్పుడో చేసేద్దాములే అని ఆలోచించకండి. ఇప్పుడే తయారై చూపించండి. ఎంతగా ప్రతిజ్ఞ చేస్తారో అంతగా పరిపక్వత లేక ధైర్యము వస్తుంది మరియు సహయోగము కూడా లభిస్తుంది.

7. ప్రతి విషయంలో పాస్ విత్ హానర్‌గా అయి చూపిస్తాము అన్న ప్రతిజ్ఞరూపీ తిలకమును రోజూ దిద్దుకోండి. పాస్ విత్ హానర్ అనగా సంకల్పంలో కూడా శిక్షలు అనుభవించకూడదు. వాణి, కర్మ, సంబంధ సంపర్కాల విషయాన్ని వదిలేయండి, అవైతే స్థూలమైనవి. కాని సంకల్పంలో కూడా తికమకపడకూడదు, ఎక్కడా చిక్కుకోకూడదు, ఇటువంటి ప్రతిజ్ఞ చేసే ధైర్యవంతులుగా అవ్వండి.

8. ఏ విధంగా జన్మ పరివర్తన అయిన తర్వాత పాత జన్మ యొక్క విషయాలను మర్చిపోతారో అలా ప్రతిజ్ఞ ద్వారా పాత విషయాలను, పాత సంస్కారాలను పరివర్తనలోకి తీసుకురండి. ఈ విధంగా పాత సంస్కారాలను భస్మం చేసెయ్యండి, ఆ అస్థికలను కూడా సంపూర్ణ స్థితి యొక్క సాగరంలో ఇమిడ్చివేయండి.

9. సంపూర్ణ స్వరూపమును ధారణ చేస్తామని మీతోమీరు ప్రతిజ్ఞ చేసుకోండి, ప్రయత్నము కాదు. ఇప్పుడు ప్రయత్నము చేసే సమయము గడిచిపోయింది. ఇప్పుడు ప్రతిజ్ఞను మరియు సంపూర్ణ రూపం యొక్క ప్రత్యక్షతనూ చేయాలి. సాక్షాత్తూ బాబా సమానంగా సాక్షాత్కారమూర్తిగా అవ్వాలి. ఈ విధంగా మిమ్మల్ని మీరు సాక్షాత్కారమూర్తులుగా భావించడం ద్వారా ఎప్పుడూ ఓడిపోజాలరు.

10. ఏ ప్రతిజ్ఞనైతే చేస్తారో దానిని పూర్తిచేసేందుకు శక్తి కూడా కావాలి. ఎంతగా సహించవలసి వచ్చినా, ఎదుర్కోవలసి వచ్చినా కాని ప్రతిజ్ఞనైతే పూర్తిచేయవలసిందే. మొత్తం విశ్వంలోని ఆత్మలందరూ కలిసి ప్రతిజ్ఞ నుండి తప్పించేందుకు ప్రయత్నం చేసినాకానీ ప్రతిజ్ఞ నుండి తప్పుకోము, ఎదుర్కొని సంపూర్ణంగా అయ్యే చూపిస్తాము. ఇటువంటి ప్రతిజ్ఞ చేసేవారి స్మృతిచిహ్నమే అచల్‌ఘర్.

11. ఏ విషయమైతే ఫోర్స్‌తో ప్రతిజ్ఞ చేస్తారో, ఆ ప్రతిజ్ఞ ప్రాక్టికల్ రూపాన్ని ధరిస్తుంది. ఎందుకంటే అందులో విల్ పవర్ ఉంటుంది. స్థూల కార్యము ఎంత ఎక్కువగా ఉన్నా కాని ప్రతిజ్ఞ చేసినట్లయితే దానిని పూర్తిచేసేస్తారు. ఒకవేళ ఆలోచన కాస్త తేలికపాటిగా ఉంటే, లేదా చేయకూడదు అనే ఆలోచన ఉన్నట్లయితే దానిని ఎప్పుడూ పూర్తిచేయలేరు. అప్పుడిక సాకులు కూడా ఎన్నో తయారవుతాయి. ప్రతిజ్ఞ చేసినట్లయితే సమయం కూడా తీయగలుగుతారు మరియు సాకులు కూడా వెళ్ళిపోతాయి.

12. ఎప్పటినుండైతే జన్మ తీసుకున్నారో అప్పటి నుండి మనస్సు అనగా సంకల్పము, సమయము మరియు కర్మలు ఏవి చేసినా వాటిని బాబా యొక్క ఈశ్వరీయ సేవార్థము చేస్తాము అని ప్రతిజ్ఞ చేశారు. ఒకవేళ ఈశ్వరీయ సేవకు బదులుగా సమయము, సంకల్పాలు లేక తనువు ద్వారా వ్యర్థ కార్యాలు జరిగినట్లయితే, వారిని సంపూర్ణ విశ్వాసపాత్రులు అని అనజాలరు. కావున సంపూర్ణ విశ్వాసపాత్రులుగా అవ్వండి.

13. చిన్న చిన్న విషయాలకు కష్టపడము, మాయ యొక్క ఎటువంటి ఆకర్షణా రూపంతోనైనా మోసపోము అని మీతో మీరు ప్రతిజ్ఞ చేసుకోండి. మేము దుఃఖహర్త, సుఖకర్త అయిన బాబా యొక్క పిల్లలము అని సదా గుర్తుంచుకోండి. ఎవరి దుఃఖాలనైనా తేలికపరిచేవారు స్వయం ఎప్పుడూ ఒక్క క్షణమైనా సంకల్పము లేక స్వప్నంలోనైనా దుఃఖపు అలలోకి రారు.

14. ప్రతిజ్ఞ చేయండి – 1.ఎప్పుడూ ఏ రూపంలోనూ, ఏ పరిస్థితిలోనూ మాయతో ఓడిపోము, యుద్ధం చేస్తాము మరియు విజయులుగా అయి తీరుతాము, మాయాజీతులుగా అయి చూపిస్తాము. 2.స్వయమును సతోప్రధానంగా తయారుచేసి చూపిస్తాము. 3.విస్మృతి యొక్క సంస్కారాలకు సదాకాలికంగా వీడ్కోలు పలుకుతాము. 4.సదా ఉల్లాస ఉత్సాహాలలో ఉంటాము మరియు ఇతరులకు కూడా ధైర్యమును కలిగిస్తాము.

15. మనస్సు, వాణి మరియు కర్మలలో పవిత్రంగా ఉంటాము అన్నది మీ అందరి మొట్టమొదటి వ్రతము లేక ప్రతిజ్ఞ. ఒక్క బాబా తప్ప ఇంకెవ్వరూ లేరు అన్న వ్రతమును అందరూ తీసుకున్నారు. కావున ఎల్లప్పుడూ ఈ వ్రతమును స్మృతిలో ఉంచుకోండి. స్మృతి ద్వారా వృత్తి ఎప్పుడూ చంచలమవ్వజాలదు. ప్రవృత్తి, పరిస్థితి లేక ప్రకృతి యొక్క ఎటువంటి విఘ్నమునకు వశమవ్వరు.

16. లాస్ట్ సో ఫాస్ట్ అనగా చివరిలో వచ్చినా వేగంగా ముందుకువెళ్ళే పురుషార్థానికి విధి – ప్రతిజ్ఞ. ఇది చేసి తీరాలి లేక ఇది ఇక ఇప్పుడు చేయకూడదు అని ఏ విషయంలోనైనా ప్రతిజ్ఞ చేయండి. ప్రతిజ్ఞ అనగా సంకల్పం చేయడము మరియు స్వరూపంగా అవ్వడము. ప్రతిజ్ఞ చేసేందుకు ఒక్కక్షణమే పడుతుంది. కావున ఇప్పుడు తీవ్ర పురుషార్థము ఒక్క క్షణముదే జరగాలి.